క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నల్లనయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నల్లనయ్యను విజయనగరానికి బదిలీ చేసిన విషయం విధితమే. ఈ మేరకు ఇప్పటి వరకు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఎం.మల్లయ్యనాయుడు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నల్లనయ్యను అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

శారదకు ఆకాశవాణిలో 'బి' గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు



మండపాక శారద

విజయనగరం టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ మృదంగ విద్వాంసుడు డాక్టర్ మండపాక రవి సతీమణి, ప్రఖ్యాత గాయని పద్మావతి శారదకు ఆకాశవాణి బి గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు లభించింది. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు సంగీతాభిమానులు, కళాకారులు, సంగీత సంస్థలు ఆమెకు అభినందనలు తెలిపాయి.

క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాకారుల ఎంపికలో సాయి వాలీబాల్ అకాడమీకి ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు సూరిబాబు, రాజు బుధవారం మాట్లాడుతూ, ఎంపికలో బాలికల నుంచి ఐదుగురు.. బాలురు నుంచి ఇద్దరిని ఎంపిక చేశామన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీన విశాఖలో నిర్వహించే ఆల్ ఇండియా పోటీల్లో వీరు ప్రాతినిథ్యం వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి భగవాన్‌దాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బీట్ పునఃప్రారంభం

శృంగవరపుకోట : పట్టణ కేంద్రంలో స్థానిక దేవీ కూడలి వద్ద కొన్ని నెలలుగా మూతపడ్డ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ను ఎట్టకేలకు బుధవారం పునః ప్రారంభించారు. దుర్గాదేవి లైటింగ్ సప్లయర్స్ యూనియన్ వారి ఆర్థిక సహకారంతో పోలీస్‌బీట్‌కు మైక్‌సెట్ ఏర్పాటు చేయగా, స్థానిక వినాయక ఆలయ కమిటీ రంగులు వేయించి సిద్ధం చేశారు. పోలీస్‌బీట్‌ను సీఐ వి.ఎన్.మూర్తి ప్రారంభించారు. ప్రజలకు ఉపయోగపడేలా పోలీస్‌బీట్ సిద్ధం చేసేందుకు సహకరించిన స్థానికులకు సీఐ అభినంధనలు లెలిపారు. ఎస్.ఐ గంగరాజు హాజరయ్యారు.

ఊరటనిచ్చిన భారీ వర్షం



తుమ్మికాపల్లి గ్రామ సమీపంలో కురుస్తున్న వర్షం

కొత్తవలస/లక్కవరపుకోట : గడిచిన కొద్ది రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలకు అల్లాడిపోయిన ప్రజానీకానికి కొత్తవలస, లక్కవరపుకోట మండలాల పరిధిలో బుధవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సమీప గెడ్డల్లోను, చెరువుల్లోను నీటి ఇంజన్‌లు పెట్టి నీటిని తోడి దమ్ములను చేసారు. ఈ దమ్ములు వేసవిని తలపిస్తున్నట్లు కాస్తున్న ఎండలకు పూర్తిగా ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. కాగా బుధవారం కురిసిన వర్షానికి వరి ఉబాలకు ఊపిరి పోసినట్లు అయిందని రైతులు సంతోషపడుతున్నారు. కొత్తవలస మండల కేంద్రంలో గల రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. భారీ వర్షం వచ్చిన ప్రతీసారి ఇదే పరిస్థితి దాపురిస్తోందని ఈ సమస్యలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

నత్తనడకన 'ఈ- పంట' నమోదు

- సెప్టెంబర్ 15 వరకు గడువు
- సంక్షేమ పథకాలన్నింటికీ ఈ – పంట నమోదు ప్రామాణికం
- ఎన్ఐసీ సర్వర్ మొరాయించడంతో నమోదుకు ఆలస్యం



చౌడువాడలో ఈ - పంట నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పూసపాటిరేగ: రైతులు పండించిన పంట, వారి వివరాలు నమోదు చేసే 'ఈ -పంట' కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ఈ పంట నమోదుకు సెప్టెంబర్ 15 గడువు తేదీగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పంట నమోదు చేసి జాతీయస్థాయిలో ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్)కు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. జాతీయ స్థాయిలో సర్వర్ మొరాయించడంతో నమోదు ఆలస్యం అవుతోంది. క్షేత్ర స్థాయికి వ్యవసాయ సహాయకులు వెళ్లి పంట వివరాలు, రైతు ఖాతా, సర్వే నంబర్, మొబైల్ ద్వారా ఈ - పంట నమోదు చేయాలి. ఎన్ఐసీ సర్వర్ మొరాయించడంతో సర్వే చేపట్టలేకపోతున్నామని వ్యవసాయశాఖ సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం సెప్టెంబర్ 15 వరకు సమయం ఇచ్చినప్పటికీ ఈ క్రాప్ పూర్తవుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

నెల్లిమర్ల నియోజకవర్గంలో సాగు వివరాలు..

మండలం	సాధారణసాగు	ప్రస్తుత వ్యవసాయ సాగు	ఈ – పంట నమోదు	శాతం
పూసపాటిరేగ	4932	3856	2103	54.53
భోగాపురం	1680	1250	1250	100.00
డెంకాడ	4800	3200	1650	51.56
నెల్లిమర్ల	4895	3760	1980	52.65

నెల్లిమర్ల నియోజకవర్గంలో ఇలా..

నెల్లిమర్ల నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 16, 307 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 12,066 ఎకరాలలో సాగు జరుగుతోంది . ఇప్పటివరకు 6,983 ఎకరాలకు సంబంధించి మాత్రమే ఈ - పంట నమోదైంది. మిగిలిన సాగుకు సంబంధించి ఈ – పంట నమోదు చేయాల్సి ఉంది. పంటల బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, బ్యాంకు రుణాలు, రాయితీపై ఎరువులు, పురుగు మందుల సరఫరా, యంత్ర పరికరాలు, పెట్టుబడి సాయం, బోర్లు మంజూరుకు ఈ – పంట నమోదునే ప్రామాణికంగా తీసుకుంటారు. సర్వర్ సమస్య కారణంగా ఈ – పంట ఆలస్యం అయ్యే పరిస్థితి కనబడుతోంది. ఎన్ని సర్వే నంబర్లకు ఈ– పంట చేశారో.. అంతమంది రైతుల వేలిముద్రలు తీసుకొని ఈకేవైసీ చేసి సర్వర్‌కు అప్‌లోడ్ చేయాలి. సర్వర్ మొరాయించడం, పొలాల్లో సెల్ సిగ్నల్స్ రాకపోవడం, తదితర కారణాలతో గడువులోగా ఈ – పంట నమోదు 100 శాతం పూర్తవుతుందా, లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఈ - పంట నమోదు చేయాల్సిన వరి సాగు

అలసత్వం వహిస్తే చర్యలు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఉపాధి పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుత ఏడాదికి సంబంధించి మొక్కలు నాటడం, డ్రెయిన్లు, సీసీ రోడ్లు, ఫారం పాండ్‌ల నిర్మాణం వంటి పనులు మంజూరు చేసినప్పటికీ, ఆ పనుల్లో కనీస స్థాయిలో కూడా ప్రగతి చూపని అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి మండల స్థాయిలోని ఎంపీడీఓలు, ఉపాధి హామీ ఏపీఓలు, పంచాయతీ రాజ్ ఏఈలు, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈలతో ఉపాధి పనులపై ఆన్‌లైన్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, బీటీ రోడ్లు, డబ్ల్యూబీఎం రోడ్లు, ఫారం పాండ్లు వంటి పనుల లక్ష్యాలను రెండు వారాల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, డ్వామా పీడీ అరుణశ్రీ, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

గిడుగును ఆదర్శంగా తీసుకోవాలి..



గిడుగు, గురజాడ, తదితర వేషధారణలో చిన్నారులు

విజయనగరం టౌన్: తెలుగు భాషకు సేవ చేసిన గిడుగును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలుగు భాషా సేవా సంఘ అధ్యక్షుడు ఆర్‌బీ రామానాయుడు అన్నారు. బుధవారం స్థానిక గాజులరేగలో ఉన్న నారాయణ స్కూల్ ఆవరణలో తెలుగుభాష వ్యాప్తికి విశేషంగా కృషి చేసిన గిడుగు, గురజాడ, కందుకూరి వేషధారణలను విద్యార్థులతో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ భాష వంటి తెలుగుభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందనలు



ఇంటర్ సర్కిల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం: ఇంటర్ సర్కిల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీఈపీడీసీఈఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్ నుంచి ప్రాతినిథ్యం వహించి పతకాలు సాధించిన ఉద్యోగులను ఎస్ఈ ఎం.లక్ష్మణరావు అభినందించారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు గాజువాకలో జరిగిన ఇంటర్ సర్కిల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం విద్యుత్ ఉద్యోగులు రెండో స్థానంలో నిలిచారు. ఈ మేరకు బుధవారం ఎస్ఈ లక్ష్మణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పోటీల్లో సింగిల్స్ ఓపెన్ విభాగంలో డిప్యూటీ ఈఈ ఎ. రామకృష్ణ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుని అక్టోబర్ నెలలో హైదరాబాద్‌లో జరగనున్న ఆల్ ఇండియా పోటీలకు అర్హత సాధించారు. అదేవిధంగా టీమ్ సభ్యులు ఎ.రామకృష్ణ, పి.శివకుమార్, ఎస్.విజయ్‌కుమార్, ఎ.సత్యనారాయణ, చంద్రశేఖర్‌లను ఎస్ఈతో పాటు ఆపరేషన్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు పి.హరి, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసన్, వి.మోహన్ బాబు, కార్యదర్శి ఎ.అప్పలసూరి, పై.పైడిరాజు, తదితరులు అభినందించారు.

వర్షంతో ఊరట..

విజయనగరం: జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్ర ఉక్కబోతతో విలవిల్లాడిన నగర ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. భారీ శబ్దంతో ఉరుములు కురవడంతో నగర ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. రెండు రోజులుగా వేసవిని తలపించే వేడితో తీవ్ర ఇక్కట్లు పడిన ప్రజలు సుమారు గంట పాటు కురిసన వర్షంతో చల్లబడ్డారు. ఇదిలా ఉండగా వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారితో పాటు రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే వారు వర్షంలో తడిసిముద్దయ్యారు. వర్షం కారణంగా విద్యుత్ శాఖ అధికారులు సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



తుమ్మికాపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తవలస : మండలంలోని కొత్తవలస – దేవరాపల్లి రోడ్డులో తుమ్మికాపల్లి గ్రామం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు బుధవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల అరకు నుంచి ఐచర్ వ్యాన్‌లో అక్రమంగా 450 కేజీల గంజాయి, అలాగే సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద 920 కేజీల గంజాయి పట్టుబడడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో ఈ రోడ్డులో వెళ్లే ప్రతీ వాహనంతో పాటూ, ఆర్టీసీ బస్సులను పైతం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ కల్గిన వాహనాలకు సంబంధించి సీ బుక్‌లను, రోడ్డు పర్మిట్లను పరిశీలిస్తున్నారు.

ఓటుహక్కు విలువైనది..



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: ప్రజాస్వామ్య పాలనలో ఓటుహక్కు విలువైనదని.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పలవురు అభిప్రాయపడ్డారు. బుధవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో 'ఇన్వెస్ట్యూచర్' సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ ఎన్నిక నిర్వహించారు. అనంతరం ఎంపికైన విద్యార్థుల హెడ్ బాయ్, హెడ్ గర్ల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ సూరినాయుడు

- ట్రాఫిక్ సీఐ సూరినాయుడు

విజయనగరం క్రైమ్: రహదారి భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు అన్నారు. పట్టణంలోని ఏజీఎల్, నారాయణ డిగ్రీ కళాశాలల్లో రహదారి భద్రతపై బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా వాహనాలు డ్రైవింగ్ చేయడంతో పాటు ఇతరుల భద్రత పట్ల కూడా వాహనదారులు శ్రద్ధ వహించాలన్నారు. సిగ్నల్స్ పాటించడం, హెల్మెట్ ధరించడం, వాహనానికి సంబంధించి అన్ని ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై లోవరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో ఆలోచించాలి

- జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: విద్యతో పాటు నైపుణ్యతను మెరుగుపరచుకోవడంలో సృజనాత్మకతతో ఆలోచించాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో హైబ్రిడ్ మోడ్‌లో బుధవారం జరిగిన ఒక రోజు ఐడియేషన్ బూట్ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఉద్యోగం అనే భావనను మించి పరిశోధనాదృక్పథంతో ఆలోచించాలన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ.. నూతన వ్యవస్థలను స్థాపించడం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఐఐఎం వైజాగ్‌కు చెందిన ప్రొఫెసర్ సుశీల్‌కుమార్ సదస్సుకు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యూబేషన్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.తిరుమలరావు, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న సీతారాముల కల్యాణోత్సవం



శ్రీరామ పట్టాభిషేకం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

విజయనగరం: మండల పరిధిలో గల రామనారాయణం పుణ్యక్షేత్రంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న సాయంత్రం ఆరు గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతకుముందు ఉదయం 7 గంటలకు స్వామివారికి స్నపన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 31న ఉదయం 9 గంటలకు శ్రీరామ పట్టాభిషేకోత్సవం జరిపించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అయోధ్య నుంచి బయలుదేరిన వెండి శ్రీరామభాణం శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో రామనారాయణం ప్రాంగణంలో రెండు రోజల పాటు భక్తుల దర్శనార్థం ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

గురుకులంలో నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో కంటి వైద్యులు ఈశ్వరరావు నేతృత్వంలో నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణం తరువాత కళ్లు నశింపకూడదని, అంధుల చూపు కోసం కళ్లు దానం చేయాలని నేత్రదానం వెలకట్టలేనిదన్నారు. చనిపోయిన 6 నుంచి 8 గంటల మధ్య నేత్రాలు దానం చేయడం వల్ల ఇతరులకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, పాఠశాల హెల్త్ సూపర్‌వైజర్ శారద, వేపాడ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఆంజనేయుడు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరుల పంట మొక్కజొన్న

- ఎకరాకు రూ.35వేలకు పైగా ఆదాయం
- ఆసక్తి చూపుతున్న రైతులు



సీతారామపురంలో మొక్కజొన్న సాగు

గజపతినగరం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో రైతులు నూతనంగా ఆలోచిస్తూ మొక్కజొన్న సాగుకు ముందుకు వస్తున్నారు. లేత దశలో తెగుళ్ల నివారణ చేపడుతూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వరితో పాటు వివిధ రకాల పంటలు వేస్తుండగా కొన్ని గ్రామాల్లో ఏడాది పొడవునా మొక్కజొన్న పండిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. పశువులకు దాణాగా కూడా మొక్కజొన్న పనికి వస్తుందని రైతులు చెబుతున్నారు. అనేక పరిశ్రమల్లో ముడి సరుకుగానూ తినుబండారాలు, తీపి కండెలు, కాయగూరల రకంగానూ పేలాల రూపంలోనూ వినియోగించడంతో ఈ పంటకు గిరాకీ పెరిగింది. ఇన్ని రకాలుగా మొక్కజొన్న ఉపయోగపడటంతో సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. మండలంలో 8,654 సాగు విస్తీర్ణ భూములు ఉండగా ఖరీఫ్‌లో 6323 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంటను 1200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. తక్కువగా పెట్టుబడితో తొందరగా దిగుబడులు వస్తుండడంతో పాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి వస్తుండడంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఎకరాకు రూ. 15 వేల నుంచి 20 వేల వరకు ఖర్చు కాగా రూ.25 వేల 35 వేల వరకు ఆదాయం వస్తుంది.

లేత దశల్లో తెగుళ్ల నివారణ

కిలో విత్తనానికి 3గ్రాముల మాంకోజెబ్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుండి కాపాడుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం

వర్షాధారపు పంటకు విత్తే సమయంలో మూడో వంతు నత్రజని 30నుండి 35 రోజుల సమయంలో, 50నుండి 55 రోజుల వ్యవధిలో మరోసారి నత్రజనిని వేయాలి. విత్తే సమయంలో మొత్తం భాస్వరం ఎరువును సగం పొటాష్ ఎరువును పూత దశలో వేయాలి. నీటి పారుదల పంటకు విత్తే సమయంలో నాలుగో వంతు నత్రజని 30రోజులు వ్యవధిలో, చివరగా 45నుండి 60రోజుల వ్యవధిలో నాలుగో వంతు వేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను మూడు పంటలకొకసారి దుక్కిలో వేయాలి. మొక్కలలో జింక్ లోపం ఉన్నట్టయితే లీటరు నీటిలో 2గ్రాములు జింక్ సల్ఫేట్‌ను కలిపి పంటపై పిచికారీ చేయాలి. భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే పైపాటు ఎరువులు వేయాలి.

కలుపు నివారణ

పంట విత్తిన తరువాత రెండు మూడు రోజుల్లోపు ఆట్రజిన్ అనే కలుపు మందును పిచికారీ చేయాలి. దీనిని తేలిక నేలలో ఎకరాకు 800గ్రాములు, బరువు నేలలో ఎకరాకు 1200 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల వెడల్పాంటి గడ్డి జాతి కలుపు మొక్కలు దాదాపు ఒక నెల పాటు అదుపు చేయొచ్చు. మొక్కజొన్నలను పప్పుజాతి పంటల్లో అంతర పంటగా వేసేటప్పుడు పంటకు 200 లీటర్ల నీటిలో లీటరు పెండిమిథాలిన్ కలిపి నాటిన రెండు రోజుల్లో పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలపు మొక్కలను గమనిస్తే ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో 500 గ్రాములు 2, 4డీసోడియం సాల్ట్‌ను కలిపి పిచికారీ చేయాలి.



లింగాలవలస గ్రామంలో ఎండ బెడుతున్న మొక్కజొన్న కండెలు

మొక్కజొన్న సాగు చేస్తున్నా...



ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగుకు అనుకూలంగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండటంతో ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను వేస్తాను. ప్రతీ ఏడాది మొక్కజొన్న పంటతో లాభాలు బాగానే వస్తున్నాయి. గ్రామాల్లోని వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– కె.సన్యాసప్పుడు, రైతు సీతారామపురం

లాభాలు బాగు



మొక్కజొన్న పంట సాగు ఎంతో సులువు. ఎకరాకు 20వేలు పెట్టుబడి పెడితే దాదాపు 30వేల వరకూ ఆదాయం లభిస్తుంది. ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగుకు అనుకూలం. ప్రతీ ఏటా రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపడతాను. ఆర్బీకే నుండి సంబంధిత అధికారులు సలహాలు ఇస్తుంటారు

–లెంక బంగారయ్య, రైతు

మూడు నెలల్లో చేతికి పంట

విత్తు నాటిన మూడు మాసాల్లోనే పంట చేతికి వస్తుంది. మండలంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో 1200 పైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతుంది. రైతులు ఏటా ఆసక్తిని పెంచుకుంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి ఇచ్చిన సలహాల మేర వ్యవసాయాన్ని చేసేందుకు ముందుకు వస్తున్నారు.

–మహారాజన్, ఏడీఏ, గజపతినగరం క్లస్టర్